
క్లుప్తంగా

ఘనంగా తహలీల్ ఫాతెహా



దర్గాలో తహలీల్ ఫాతెహా నిర్వహిస్తున్న స్వామి వారసులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దర్గావీధిలో వెలసిన హుసేన్ పీర్ దర్గా 198వ ఉరుసు మహోత్సవాలు సోమవారం నిర్వహించిన తహలీల్ ఫాతెహాతో ముగిశాయి. ఇందులో భాగంగా సాయంత్రం స్వామి వారసులు స్వామి సమాధికి పూలచాదర్ సమర్పించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్వామి వారసులతో పాటు శిష్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దర్గా ఆవరణలో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో స్వామి వారసులు దర్గా రహమతుల్లా సాహెబ్, దర్గా షఫివుల్లా సాహెబ్, దర్గా మహమ్మద్ కరీముల్లా, దర్గా మున్వర్, దర్గా సలీం, ఆర్గనైజర్లు అన్వర్‌బాషా, సిమెంట్ షరీఫ్, అంజాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రీసర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

అట్లూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూరక్ష పథకంలో భాగంగా రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీవాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండూరు రెవెన్యూ పొలంలో జరుగుతున్న భూ సర్వేను ఆమె సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో సర్వేయర్లు సుబ్బారెడ్డి, ప్రసన్న, వీఆర్ఓ దొరబాబు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు సత్వరం పరిష్కరించాలి

దువ్వూరు : మండల వ్యాప్తంగా స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ రమాకుమారి తెలిపారు. దువ్వూరు మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖలకు చెందిన అధికారులను ఉద్దేశించి తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాలని సూచించారు.

తల్లిపాలతో వ్యాధినిరోధక శక్తి

గోపవరం : తల్లిపాలు తాపించడం వలన పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి తెలిపారు. సోమవారం మండలంలోని బెడుసుపల్లె అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ రాధమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల వలన పిల్లలకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ గౌస్, రాచాయపేట, చెన్నవరం, గోపవరం, బేతాయపల్లె, శ్రీనివాసపురం అంగన్వాడీ టీచర్లు మునెమ్మ, గౌరి, సత్యవతి, ఆయాలు పాల్గొన్నారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీత వెంకట్‌కు సన్మానం



వెంకట్‌ను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : రాష్ట్రపతి అవార్డు గ్రహీత కామిశెట్టి వెంకట్‌ను దీప్తి జూనియర్ కాలేజి యాజమాన్యం సన్మానించింది. వెంకట్‌చే సోమవారం కళాశాలలో మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకట్ ప్రదర్శన, ప్రతిభా పాటవాలను విద్యార్థులు, అధ్యాపకులు మెచ్చుకున్నారు. పాటలు, డ్యాన్స్, లిప్ రీడింగ్, డైలాగులతో అతను విద్యార్థులను అలరించాడు. విద్యార్థులకు ఉండాల్సిన లక్షణాలు, ఆత్మవిశ్వాసం, అంకిత భావం తదితర వాటి గురించి వెంకట్ తల్లి విశాలాక్షి విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి వెంకట్‌కు శాలువా కప్పి మెమెంటోతో సత్కరించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ఆకస్మిక తనిఖీ



ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు డీఎంహెచ్ఓ

అట్లూరు : మండలంలోని కొండూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని జిల్లా అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పర్యవేక్షణలో భాగంగా మిషన్ ఇంద్రధనుష్ వ్యాక్సిన్ కార్యక్రమం, నులిపురుగుల నివారణ ట్యాబ్లెట్ల పంపిణీ గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ డి.విస్వంత్, డాక్టర్ కె.హమీదాబేగం, సీహెచ్ఓ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

లాభదాయకం .. డ్రాగన్ ఫ్రూట్ సాగు

- ఎకరా సాగుకు రూ.5లక్షలు పెట్టుబడి
- కిలో రూ.150 అమ్మకం

ప్రొద్దుటూరు : ఒకప్పుడు అందంగా కనిపించే డ్రాగన్ ఫ్రూట్ మార్కెట్‌లో మాత్రమే కనిపించేది. ధర కూడా చాలా ఎక్కువగా ఉండేది. అలాంటి పంటను మన ప్రాంత రైతులు ఇటీవలి కాలంలో సాగు చేయడం నేర్చుకున్నారు. ప్రొద్దుటూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన రైతు కల్లూరు నాగమునిరెడ్డి ఆరు ఎకరాల విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేస్తున్నారు. గత రెండేళ్లుగా ఈ పంట సాగులో ఉంది. పంట సాగు కోసం దాదాపు ఎకరాకు రూ.5లక్షల వరకు వెచ్చించారు. పంటను రక్షించుకోవడాన్ని బట్టి పాతికేళ్ల వరకు సాగు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.150 వరకు డ్రాగన్ ఫ్రూట్ పలుకుతుండగా హోల్ సేల్ వ్యాపారానికి సంబంధించి టన్ను రూ.60వేలుగా ఉంది. సాధారణంగా శంకరాపురం గ్రామంలో ఎక్కువ మంది రైతులు వరి పంట, శనగ పంటను సాగు చేస్తున్నారు. నాగ మునిరెడ్డి వినూత్నంగా ఆలోచించి డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేశాడు. ప్రస్తుతం పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. డ్రాగన్ ఫ్రూట్‌లో విటమిన్లు, మినరల్స్ ఎక్కువగా ఉండటం, ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉండటంతో ప్రజలు వీటిని తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ కారణంగానే వీటికి డిమాండ్ ఉంది.



ప్రొద్దుటూరు మండలం శంకరాపురంలో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ తోట



చెట్టుకు కాసిన డ్రాగన్ ఫ్రూట్స్



డ్రాగన్ ఫ్రూట్స్

డ్రాగన్ ఫ్రూట్‌కు సబ్సిడీ ఉంది



ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు ప్రాంతాల్లో ముగ్గురు రైతులు డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగు చేస్తూ లబ్ధి పొందుతున్నారు. ఉద్యాన శాఖతోపాటు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పంట సాగుకు సబ్సిడీ ఉంది. ఈ పంటకు ఎలాంటి చీడపీడలు ఆశించవు. 25 నుంచి 30 ఏళ్ల వరకు పంటను అలాగే ఉంచుకుని రైతులు లబ్ధి పొందవచ్చు.

- జయభరత్ రెడ్డి, ఉద్యానశాఖ అధికారి

బాగా ఆదాయం పొందవచ్చు



డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేయడానికి ఎక్కువ పెట్టుబడి అవసరం. పంట నాటిన ఆరు నెలల నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. ఎప్పటికీ డ్రాగన్ ఫ్రూట్‌కు డిమాండ్ ఉంటుంది. పంట సాగు చేయడం వల్ల రైతులు బాగా ఆదాయం పొందవచ్చు. పండ్లు ఆరోగ్యానికి అన్ని విధాలా ఉపయోగంగా ఉండటంతో మార్కెట్‌లో డిమాండ్ ఉంది.

- నాగమునిరెడ్డి, రైతు, శంకరాపురం, ప్రొద్దుటూరు మండలం

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మహిళా జాగృతి సభలో మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్టు న్యాయవాది విజయభారతి

బద్వేలు అర్బన్ : మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలపై మహిళలు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ హైకోర్టు న్యాయవాది ఎస్.విజయభారతి పేర్కొన్నారు. స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థినులకు, రాచపూడి నాగభూషణం ఫంక్షన్ హాలులో మహిళలకు సోమవారం రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన మహిళా జాగృతి సభలో ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి ముందుకు వస్తున్నారని, ఇదే సమయంలో అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎస్‌కేపీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చిన్నిబసవయ్య, రామకృష్ణ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు అంకయ్య, అమరేంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శశిధర్, చిత్తూరు సేవావికా సమితి సభ్యురాలు సుధామయి, విద్యార్థినులు, మహిళలు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం



శివానగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో గల శివానగర్‌లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వార్డులోని ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఏ ఒక్క సంక్షేమ పథకంలో కోత విధించకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సివిల్‌సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడు బంగారు శీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, వార్డు కౌన్సిలర్లు వెంకటక్రిష్ణ, సత్యం, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు నాగేశ్వర్‌రావు, రెడ్డెయ్య, సాంబశివారెడ్డి, షఫి, చెంచయ్య, లాయంచిన్న, నరసింహ, మురళి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం



విద్యార్థులతో మాట్లాడుతున్న పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి

బద్వేలు అర్బన్ : విద్యతోనే సమాజంలోని అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్య, భోజనం సరైన సమయానికి అందేలా చూడాలని వారికి సూచించారు. పాఠశాలలో 1800 మంది విద్యార్థులకు సమయానికి మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు మంచి విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయుల కృషి మరువలేనిదన్నారు.

ప్రభుత్వ పాఠశాల తీరుపై ప్రశంసలు



రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దేగల మహేష్

పోరుమామిళ్ల : ఛత్రపతి శివాజీ జాతీయవాద జాగృతి యాత్రలో భాగంగా హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు దేగల మహేష్ సోమవారం సాయంత్రం మండలంలోని రామేశ్వరం ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. శ్రీకాకుళం నుంచి మోటార్‌బైక్‌లో గన్నవరం చేరుకుని, అక్కడి నుంచి మార్కాపురం మీదుగా తిరుపతి వెళుతూ మార్గమధ్యంలో రామేశ్వరం పాఠశాల సందర్శించారు. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా, అంతకన్నా గొప్పగా ప్రభుత్వ పాఠశాల ఉండటం చాలా ఆనందంగా ఉందన్నారు. పాఠశాలను గొప్పగా తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డిని సత్కరించారు.

చెరువుకట్టపై బోరు వేయించిన డాక్టర్ కార్తీక్



బోరును ప్రారంభిస్తున్న డాక్టర్ కార్తీక్

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల చెరువుకట్ట తిప్పపై ఉన్న భైరవేశ్వర దేవస్థానం వద్ద పట్టణానికి చెందిన ప్రైవేటు డాక్టర్ కార్తీక్ కుమార్ సోమవారం బోరు వేయించి మోటారు ఏర్పాటు చేశారు. చెరువును సందర్శించేందుకు తరచూ ప్రజలు వెళుతుంటారు. వన భోజనాలకు చెరువుకట్ట తిప్పపై ఉన్న భైరవాలయం వద్దకు వెళ్లడం ఆనవాయితీ. చెరువును, తిప్పపై ఆలయాన్ని చూసేందుకు వెళ్లే వారికి అక్కడ చాలా ఏళ్లుగా నీటి వసతి లేక దాహంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో చిన్నపిల్లల డాక్టర్ కార్తీక్ ముందుకు వచ్చి బోరు వేయించి నీటి వసతి కల్పించడాన్ని పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ అసోసియేషన్ అధ్యక్షుడు రాముడు, రంగసముద్రం ఉపసర్పంచ్ ప్రసాద్, రచయిత బొల్లు రామమోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సంగా వసంతరాయలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ కార్యక్రమం వంద శాతం జరగాలి



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను వంద శాతం వేయాలని జమ్మలమడుగు ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మిషన్ ఇంద్రధనుష్ 5.0 ద్వారా సోమవారం దొరసానిపల్లెలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ కారణం చేతనైనా వ్యాధినిరోధక టీకాలు వేయించని పిల్లలకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో మిషన్ ఇంద్రధనుష్ 5.0 ద్వారా టీకాలు వేయించాలన్నారు. దీనిపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. మండల ఆరోగ్య నోడల్ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లలకు టీకాలు వేయించదలిచిన వారు యూ–విన్ యాప్ ద్వారా ముందస్తుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ శోభారాణి, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, సీహెచ్ఓ దివ్యలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త సుప్రజ, ఆశా కార్యకర్తలు సుజాత, పుష్ప, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు కృషి చేద్దాం



నులిపురుగుల నివారణ కార్యక్రమం పోస్టర్లను విడుదల చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

బద్వేలు అర్బన్ : ఈ నెల 10వ తేదీన జరగనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 1–19 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు అందించి నులిపురుగుల నిర్మూలనకు కృషి చేద్దామని మండల తహసీల్దార్ వై.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ సూర్యహేన్‌లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, టీచర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలతో మింగించాలన్నారు. కార్యక్రమంలో తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్నస్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన పాఠశాల విద్యార్థులకు, అంగన్వాడీ చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మైథిలి, ఎంఈఓ నిర్మల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, ఆరోగ్య విస్తరణాధికారులు నరసింహారెడ్డి, సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి

ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి



పలుగురాళ్లపల్లె ఎస్సీ కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ప్రతి నిరుపేద కుటుంబానికి లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. సోమవారం బ్రహ్మంగారిమఠం మండలంలో పలుగురాళ్లపల్లె 1 గ్రామ సచివాలయ పరిధిలో పలుగురాళ్లపల్లె, ఎస్సీకాలనీ, కొత్తపల్లె, జౌకుపల్లె మాదిగవాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన పథకాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో ప్రజల వద్దకు వస్తున్నామని తెలిపారు. ప్రతి నిరుపేదకు ప్రభుత్వం ఏదో ఒక రకమైన సహాయం చేసిందన్నారు. ఇందుకు ప్రజలు కూడా తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్న కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలు అడిగిన పలు సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బిరెడ్డి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ కూనపులి రాజానాయుడు, సర్పంచ్ సోమిరెడ్డిపల్లె మార్తమ్మ, ఎంపీటీసీ మూరతోటి లలితమ్మ, ఉపసర్పంచ్ బసిరెడ్డి దుగ్గిరెడ్డి, వాటర్‌షెడ్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ ఎం రామచంద్రారెడ్డి, కొత్తపల్లె నాగసుబ్బారెడ్డి, ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి సుధీర్, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జాన్స్, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు పలుగురాళ్లపల్లె2 సచివాలయం పరిధిలో..

మండలంలోని పలుగురాళ్లపల్లె 2 గ్రామ సచివాలయ పరిధిలో ఎర్రంపల్లె, భాకరాపేట, బొగ్గులవారిల్లె, జౌకుపల్లె గ్రామాలలో మంగళవారం ఉదయం 7 గంటలనుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరవుతారన్నారు. పంచాయతీ పరిధిలోని సర్పంచ్, ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకులతోపాటు మండల స్థాయి నాయకులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మైదుకూరు : మైదుకూరులోని ఉర్దూ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.సర్వేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గెస్ట్ లెక్చరర్‌గా ఎంఎస్‌సీ ఫిజిక్స్, బీఈడీ చదివిన, లేదా తత్సమాన అర్హత ఉన్న ఫిజిక్స్ ఉర్దూ మాధ్యమంలో 50 శాతం మార్కులు ఉన్న వారు అర్హులన్నారు. అర్హులైన వారు ఈనెల 15వ తేదీలోపు కళాశాలలో తమ దరఖాస్తులు అందించాలని సూచించారు.

దోమలు, కుక్కలు, పందుల బారి నుంచి కాపాడండి

పోరుమామిళ్ల : పట్టణంలో ఇటీవల కాలంలో దోమలు విజృంభించి రాత్రిళ్లు ప్రజల ప్రాణాలు తోడేస్తున్నాయని సీపీఐ నాయకులు మస్తాన్, రవి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వారు మాట్లాడుతూ పట్టణంలో కుక్కలు, పందులు విపరీతంగా పెరిగాయని, మనుషులను కరుస్తున్నాయని వాటి బారి నుంచి ప్రజలను కాపాడాలని కోరారు. మండలంలోని 17 పంచాయతీల్లో మురికికాలువలు, వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని కోరారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

కాశినాయన : మండలంలోని వరికుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 9, 10వ తరగతులు, ఇంటర్ చదువుతున్న విద్యార్థినులకు సోమవారం వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ‘మానవత విలువలు’ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆ సంస్థ గౌరవ సలహాదారులు రాజోలు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. సంస్థ వ్యవస్థాపకుడు పి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలి

గోపవరం : సంక్షేమ పథకాల అమలుతో పాటు జరుగుతున్న అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణలతో కలిసి అన్నిశాఖల అధికారులతో సమావేశమయ్యారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయించాలన్నారు. అనంతరం స్పందనలో అర్జీలు స్వీకరించారు. పశువైద్యాధికారి క్రిష్ణవేణి, ఏపీఎం శివప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఈటీఆర్‌డీ హసీనా, ఎంఈఓ చెన్నయ్య పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

చాపాడు : గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వెదురూరు గ్రామ సచివాలయం వద్ద నూతనంగా రూ.20.81 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.21.10 లక్షలతో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను సోమవారం ఎమ్మెల్యేతో పాటు వ్యవసాయశాఖ రాష్ట్ర సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఉద్యానశాఖ రాష్ట్ర సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సాధారణ ప్రజలతోపాటు రైతులకు అన్ని రకాల ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. రైతులందరూ తమకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. విలేజ్ క్లినిక్ దగ్గర ప్రతి 15 రోజులకోసారి వైద్య శిబిరం నిర్వహిస్తారని, ప్రతి రోజూ గ్రామంలోనే వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లలితమ్మ, ఎంపీపీ లక్షుమయ్య, ఎంపీటీసీ శివ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖరరెడ్డి, మండల వ్యవసాయాధికారి మ్యాగి, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, వైద్యాధికారి ఖాజా, నాయకులు ఎల్లారెడ్డి, వీరారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జయరామిరెడ్డి, సీపీ సుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, రమణయ్య, ప్రసాద్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేశాం

చాపాడు : మండల పరిధిలోని రోడ్లను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలో నూతనంగా నిర్మించిన రామసుబ్బమ్మ కొట్టాలు – వెదురూరు రహదారిని ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పూర్తి చేయని, దెబ్బతిన్న రోడ్లు పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచామన్నారు. రాజకొట్టాలు రోడ్డు నుంచి ఖాజీపేట మండలం తవ్వారుపల్లె వరకు రూ.4.65 కోట్లతో ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన పథకం ద్వారా కేసీ కెనాల్ కాలువ వెంబడి ఉన్న గ్రామాలను కలుపుతూ రోడ్డు నిర్మాణాన్ని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పూర్తి చేశామన్నారు. చింతకుంట – చియ్యపాడు రహదారిని కూడా అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, డీఈ మల్లేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వినయ్‌కుమార్ రెడ్డి, రమణయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

మండల్ కమిషన్‌లోని అంశాలు అమలు చేయాలి

బద్వేలు అర్బన్ : మండల్ కమిషన్ నివేదికలోని అంశాలను అమలు చేసి బీసీలకు న్యాయం చేయాలని మండల్ ఆశయసాధన సమితి రాష్ట్ర కన్వీనర్ కె.రమేష్‌యాదవ్ పేర్కొన్నారు. మండల్‌డేను పురస్కరించుకుని సోమవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో మండల్ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల్ కమిషన్ చైర్మన్ బిందేశ్వరిప్రసాద్ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల్ కమిషన్ సిఫార్సుల అమలుతోనే బీసీల జీవితాల్లో వెలుగులు నిండుతాయని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు గురుమూర్తి, మండల్ విగ్రహ కమిటీ బాధ్యుడు చంద్రశేఖర్‌యాదవ్, బీసీ సంఘం అధ్యక్షుడు శివరామయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి నాయకుడు పిచ్చయ్య, యాదవ సంఘం నాయకుడు రమేష్, సామాజిక ఉద్యమ నాయకుడు ఓ.ఎస్.వి.ప్రసాద్, ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్వర్‌బాషా, బీసీ నాయకుడు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ



శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామంలో క్రిస్టియన్ శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణ పనులకు సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కొత్తపల్లె–మీనాపురం గ్రామాల మధ్యలో ఉన్న క్రిస్టియన్ శ్మశానవాటిక అన్యాక్రాంతం కాకుండా రూ.12 లక్షలతో ప్రహరీని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కొత్తపల్లెలో ముస్లిం శ్మశాన వాటిక పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఖాదర్‌బాద్, లింగాపురం, మీనాపురం, జేమ్స్‌కొట్టాల తదితర ప్రాంతాల్లో హిందూ శ్మశాన వాటికల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటరంగయ్య, పారిశ్రామికవేత్త సుబ్బయ్య, మార్కు, దేవరాజు, నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.